





## హైదర్గూడాలో ఘనంగా
# అంతర్జాతీయ యోగా దినోత్సవం

ఇది కద నిజం, రాజేంద్రనగర్: హైదర్గూడా డివిజన్ పరిధిలోని లక్ష్మీ నగర్ పార్కులో ఆదివారం అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమం కన్నుల పండుగగా జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక యోగా శిబిరంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు మరియు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. హాజరైన వారందరూ ఉత్సాహంగా యోగాసనాలు, ప్రాణాయామం చేస్తూ ఆరోగ్యంపై అవగాహన చాటారు. నిత్య జీవితంలో యోగాను ఒక భాగంగా చేసుకోవడం ద్వారా మానసిక ప్రశాంతత, శారీరక దృఢత్వం సిద్ధిస్తుందని ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు పేర్కొన్నారు. స్థానికుల చొరవతో, అందరి భాగస్వామ్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమం లక్ష్మీ నగర్ పార్కులో పండుగ వాతావరణాన్ని తలపించింది.

# గిరిజన జీవితాలతో ప్రభుత్వాలు చెలగాటమాడుతున్నాయి

**రమావత్ అంజయ్య నాయక్**

ఇది కద నిజం,రాజేంద్రనగర్, జూన్ 21: నాడు ఫార్మాసిటీ, నేడు ఫ్యూచర్ సిటీ పేరుతో రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజన జీవితాలతో చెలగాటమాడుతున్నాయని తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్య నాయక్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాజేంద్రనగర్‌లోని ఏఆర్ దేవరాజ్ భవన్‌లో సక్రు నాయక్ అధ్యక్షతన జరిగిన తెలంగాణ గిరిజన సమాఖ్య రంగారెడ్డి జిల్లా మూడవ మహాసభకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. గత కేసీఆర్ ప్రభుత్వం ఫార్మాసిటీ పేరుతో గిరిజన భూములను అక్రమంగా ఆక్రమించుకొని, అరకొర నష్టపరిహారంతో చేతులు దులుపుకుందని, ఆ కారణంగా ఎందరో గిరిజన రైతులు పట్టణాలకు వలస వెళ్లి కార్మికులుగా మారారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ప్రజా పాలన అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే బాటలో నడుస్తూ, కేవలం పేరు మార్చి 'ఫ్యూచర్ సిటీ' పేరిట గిరిజన ఆవాసాలను, భూములను తక్కువ ధరలకే లాక్కుంటూ వారిని వెళ్లగొడుతోందని మండిపడ్డారు. పాలకులు మారినా వారి స్వభావం మారలేదనడానికి ఇదే నిదర్శనమని, తండాల అభివృద్ధి జరుగుతుందని నమ్మి కాంగ్రెస్‌ను గెలిపిస్తే పేదలు వేసుకున్న గుడిసెలను అక్రమంగా తొలగిస్తూ ఈ ప్రభుత్వం శాపంగా మారిందని విమర్శించారు. కార్పొరేట్ శక్తులు అక్రమ వెంచర్లతో గిరిజన తండాలను ఆక్రమిస్తుంటే ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం బాధాకరమన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన 'చేవెళ్ల డిక్లరేషన్' హామీలను గిరిజనులకు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ యువత నిరాశకు




గురికాకుండా చూడాలని, సంక్షేమ కార్పొరేషన్లు నిర్వీర్యమయ్యాయని, 'రాజీవ్ యువ వికాసం' దరఖాస్తులపై శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు. గిరిజన పారిశ్రామికవేత్తలకు సబ్సిడీ బకాయిలు విడుదల చేయాలని, నిధులు లేక కొట్టుమిట్టాడుతున్న తండాలను రెవెన్యూ పంచాయతీలుగా గుర్తించి ప్రత్యేక కేటాయింపులు జరపాలని డిమాండ్ చేశారు. ఈ మహాసభలో సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ. రవీంద్ర చారి మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లాలో గిరిజన సమస్యలపై రాజీలేని పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 80 ఏళ్లు గడుస్తున్నా గిరిజనుల జీవితాల్లో మార్పు రాలేదని, బతుకుదెరువు కోసం వచ్చి ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్న గిరిజనులకు పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. గిరిజన సమాఖ్య ఆధ్వర్యంలో రాబోయే రోజుల్లో చేపట్టే ప్రజాపోరాటాలకు భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) సంపూర్ణ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు, మాజీ జిల్లా కార్యదర్శి పుస్తకాల నర్సింగరావు, మండల కార్యదర్శి కన్యగారి నర్సింహ్మారెడ్డి, బాతరాజు నరసింహ, శేఖర్ రెడ్డి, ఏఐఎస్ఎఫ్ నాయకులు క్రాంతి, బిచ్చు నాయక్, రెడ్యానాయక్, జి. రవి, శారద, ఊర్మిళ, పి. బుజ్జి, సురేష్, లచ్చు నాయక్, భాను, మహేష్, పాండు నాయక్, శంకర్, శివ తదితరులు పాల్గొన్నారు.

## స్విస్ ప్రాంగణంలో
# ఘనంగా యోగా దినోత్సవం



హైదరాబాద్ బండ్లగూడా జాగీర్ లోని శ్రీ విద్యారణ్య ఇంటర్నేషనల్ స్కూల్ ఎన్‌సిసి విద్యార్థులు అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా యోగాసనాలను అత్యంత నైపుణ్యంతో, క్రమశిక్షణతో ప్రదర్శించి అందరి ప్రశంసలు అందుకున్నారు. ఈ కార్యక్రమానికి పసర్తి మల్లయ్య గారు, కోశాధికారి, విద్యాభారతి దక్షిణమధ్య క్షేత్రం, సి. రాజారెడ్డి , పూర్వ విద్యార్థి పరిషత్ సహసంయోజక్, వెంకటస్వామి , జాయింట్ సెక్రటరీ, స్విస్ ముఖ్య అతిథులుగా విచ్చేసి విద్యార్థులను ఆశీర్వదించారు.


ఈ సందర్భంగా వారు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, "ఫోన్‌కు రీఛార్జ్ ఎంత అవసరమో, మన శరీరానికి యోగ సాధన అంతే అవసరం" అని చక్కని ఉపమానం ద్వారా యోగ ప్రాముఖ్యతను వివరించారు.ఈ యోగ సాధన కార్యక్రమంలో శ్రీ విద్యారణ్య ఇంటర్నేషనల్ స్కూల్ యోగ మరియు ఎన్‌సిసి ఆచార్యులు విద్యార్థులను క్రమశిక్షణతో, నిబద్ధతతో నడిపించి యోగాసనాలను సమర్థవంతంగా నిర్వహించారు.

## శారదాధామంలో ఘనంగా యోగా దినోత్సవం



హైదరాబాద్ బండ్లగూడ జాగీర్‌లోని శ్రీ విద్యారణ్య ఆవాస విద్యాలయంలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విద్యాభారతి కార్యకారిణి సభ్యులు కాశీపతి జీ, రంగారెడ్డి జిల్లా పెద్దలు డాక్టర్ అమరేందర్ విద్యాలయం అధ్యక్షులు అర్జున్ గౌడ్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్య జీవితంలో యోగా ప్రాధాన్యతను, ఆరోగ్యం మరియు క్రమశిక్షణతో కూడిన జీవన విధానాన్ని విద్యార్థులకు వివరించారు. పాఠశాల కార్యదర్శి బొడ్డు శ్రీనివాస్, ప్రిన్సిపాల్ అరుణ సూచనల మేరకు పాఠశాల అధ్యాపకులు కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని వివిధ ఆసనాలను ప్రదర్శిస్తూ ఈ వేడుకను విజయవంతం చేశారు.

## రాపూరు సాయిబాబా ఆలయంలో 36వ వార్షికోత్సవ వేడుకలు



నెల్లూరు జిల్లా రాపూరు(ఇది కద నిజం):-నెల్లూరు జిల్లా, రాపూరు పట్టణంలోని ప్రసిద్ధ షిరిడి సాయిబాబా ఆలయ 36వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయంలో బాబాకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హారతి కార్యక్రమాలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.?వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని దివంగత మినుములు సురేష్ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు దామిశెట్టి భారతి, కుమారుడు సాయి విఘ్నేష్ – జ్యోతిక, సాయి అలేఖ్య, దామిశెట్టి శేఖర్ – రమ్యశ్రీ, మరియు శివ మణికంఠ తదితరుల ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో భారీ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.?ఈ అన్నదాన మహోత్సవానికి రాపూరు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. విచ్చేసిన భక్తులందరికీ కమిటీ సభ్యులు, దాతలు స్వయంగా దగ్గరుండి అన్నప్రసాదాలను పంపిణీ చేశారు. స్వామివారి కృపతో పాటు, ఇంతటి బృహత్తర కార్యక్రమాన్ని విజయవంతం చేసిన దాతల కుటుంబ సభ్యులను భక్తులు, ఆలయ నిర్వాహకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## విశాఖ లో యోగా దినోత్సవం లో పాల్గొన్న ఎపి బిజెపి అధ్యక్షుడు. పివిఎన్ మాధవ్



అమరావతి,జూన్ 21,ఇది కద నిజం: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ గారు దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రపంచమంతా యోగమయం కావాలనే మహోన్నత సంకల్పంతో గౌరవనీయ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారు జూన్ 21ను అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ప్రపంచ వేదికపై స్థాపించారని అన్నారు. నేడు ప్రపంచంలోని వందలాది దేశాలు యోగాను స్వీకరించి ఆరోగ్యవంతమైన జీవన విధానంగా అనుసరిస్తుండటం భారతదేశానికి గర్వకారణమని పేర్కొన్నారు.

యోగం అనేది కేవలం శారీరక వ్యాయామం మాత్రమే కాదని, మనసు, శరీరం మరియు ప్రకృతిని అనుసంధానించే జీవన విధానమని తెలిపారు. సమతుల్యత, క్రమశిక్షణ, మానసిక ప్రశాంతత మరియు ఆరోగ్యాన్ని అందించే గొప్ప సాధన యోగమని చెప్పారు.

## 32 మంది ఆకతాయిలు
# రెడ్ హ్యాండెడ్‌గా అరెస్ట్!




సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో మహిళలు, పిల్లల భద్రత కోసం షీ టీమ్స్ మరియు యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ విస్తృతంగా తనిఖీలు చేపట్టాయి. బహిరంగ ప్రదేశాల్లో మహిళలను వేధిస్తున్న 32 మంది ఆకతాయిలను షీ టీమ్స్ డెకాయ్ ఆపరేషన్ల ద్వారా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నాయి. అలాగే, మానవ అక్రమ రవాణాకు వ్యతిరేకంగా జరిపిన దాడుల్లో ఏడుగురు బాధితులను రక్షించి, తొమ్మిది మంది నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివిధ కుటుంబ కలహాల కేసుల్లో 29 కుటుంబాలను కౌన్సిలింగ్ ద్వారా తిరిగి ఒకటి చేయడంతో పాటు, సైబర్ నేరాలు మరియు వేధింపులపై సుమారు 3,559 మందికి అవగాహన సదస్సులు నిర్వహించారు. మహిళల రక్షణే ధ్యేయంగా ఈ ప్రత్యేక భద్రతా చర్యలు కొనసాగుతున్నాయని మహిళా, శిశు సంక్షేమ విభాగం డీసీపీ కె. సృజన ఒక ప్రకటనలో తెలిపారు.

## రాష్ట్ర వ్యాప్తంగా 23న పాఠశాలల బంద్




నల్లగొండ (ఇది కద నిజం):ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు కృషి చేయాలని, ప్రైవేట్ మరియు కార్పొరేట్ పాఠశాలల ఆర్థిక దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేస్తూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో ఈనెల 23వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలల బంద్‌కు పిలుపునిచ్చిందని ఏబీవీపీ నల్లగొండ జిల్లా కన్వీనర్ కొంపల్లి సూర్య తెలిపారు.. రాష్ట్ర బందు లో భాగంగా జిల్లా ఎబివిపి కార్యాలయంలో బంద్ పోస్టర్‌ను విడుదల చేసిన ఆయన మాట్లాడుతూ.... రాష్ట్రంలో అనేక ప్రభుత్వ పాఠశాలలలో మౌళిక వసతుల కొరత, ఉపాధ్యాయు ఖాళీలు, నిధుల లేమితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అన్నారు. మరోవైపు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు అధిక ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపుతున్నాయని ఆరోపించారు... ప్రైవేట్ పాఠశాలల దోపిడీని అరికట్టేందుకు ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని, ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని, విద్యా వ్యాపారీకరణను అరికట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.. విద్యారంగ పరిరక్షణ 23న జరిగే పాఠశాలల బంద్‌కు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థి సంఘాలు ప్రజలు సహకరించి విజయవంతం చేయాలని కోరారు..

## నాసిరకం ఐస్‌క్రీమ్‌లపై అధికారుల నిర్లక్ష్యం -- ప్రజల ఆరోగ్యంతో చెలగాటం




కొత్తపేట (ఇది కద నిజం)జూన్ :20ఎండలు ఎక్కువగా ఉన్నాయి కదా అని బయట దొరికే చౌకైన ఐస్‌క్రీమ్‌లు పిల్లలకు కొనిచ్చారా? కాసేపటి చల్లదనం కోసం కొనిచ్చిన ఆ ఐస్‌క్రీమ్ వల్ల తరువాత ఆసుపత్రి బిల్లులు చెల్లించడానికి కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడే పరిస్థితి రావచ్చు. అధిక లాభాల కోసం కొన్ని అనధికారిక మరియు నాసిరకం తయారీ సంస్థలు మార్కెట్లో నాణ్యతలేని ఐస్‌క్రీమ్‌లను విస్తృతంగా విక్రయిస్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

తెలుగు రాష్ట్రాల్లో ఇటువంటి నాసిరకం ఐస్‌క్రీమ్ తయారీ మరియు విక్రయ కేంద్రాలు పుట్టగొడుగుల్లా పెరిగిపోతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా పిల్లల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం, ఆహార భద్రతా శాఖ, స్థానిక అధికారులు ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి అక్రమ తయారీ కేంద్రాలపై దాడులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలి. గుర్తింపు లేని కంపెనీల ఉత్పత్తులు, లేబుల్ లేని ఐస్‌క్రీమ్‌లు, అత్యంత చౌకగా విక్రయించే ఉత్పత్తులను కొనుగోలు చేయకుండా ఉండటం మంచిది. పిల్లల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని నాణ్యత గల, అనుమతులు పొందిన సంస్థల ఉత్పత్తులనే కొనుగోలు చేయాలి.

## పవన్ కళ్యాణ్ పై అవాకులు చవకులు పేలితే ఖబడ్దార్..!!




ఇది కద నిజం న్యూస్ కడపజిల్లా జూన్ 21: ఓ రౌడీ షీటర్ అదృశ్యమైతే జనసేన పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పై వైసిపి అధినేత, పులివెందుల ఎమ్మెల్యే జగన్మోహన్ రెడ్డి అవాకులు చవాకులు పేలితే చూస్తూ ఊరుకోమని నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని రాజంపేట జనసేన పార్టీ పార్లమెంట్ అధికార ప్రతినిధి అతికారి కృష్ణ హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన జనరంజకంగా ఉందని రాష్ట్ర ప్రజల్లో కూటమి ప్రభుత్వానికి ఆదరణ చూసి వైసిపి పేటియం కుక్కలు ఓర్వలేక పవన్ కళ్యాణ్ పై ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని, మండిపడ్డారు. సాయి కృష్ణ అనే ఓ రౌడీ షీటర్ లాకప్ డెత్ గురయ్యాడని, కృష్ణలంక సీఐ నాగరాజు కొట్టి చంపేసి కాల్చిపడేసారని, సాయికృష్ణ తల్లి ఆరోపించిన విషయం తెలుసుకొని వెంటనే సిఐ నాగరాజును సస్పెండ్ చేసి విచారణకు కూటమి ప్రభుత్వం ఆదేశించిందన్నారు. ఈ విషయాన్ని పదే, పదే మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ పై వైసిపి పేటియం కుక్కలు నోటికి వచ్చినట్లు మాట్లాడితే సహించబోమని తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని కృష్ణ హెచ్చరించారు.

## అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా వేడుకలు



అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని పంజాగుట్ట కేశవనగర్ కాలనీలోని శ్రీ సరస్వతి విద్యామందిర్ పాఠశాలలో యోగా ఉపాధ్యాయురాలు అనంతలక్ష్మి ఆధ్వర్యంలో యోగా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సహకార్యదర్శి బొంత గోమతి, శిశువాటిక ప్రాంత ప్రముఖ్ కొట్టపల్లి ఉమ, ప్రబంధకారిణి సభ్యులు ప్రసాద్, సహ ప్రధానాచార్యులు నవీన్‌తో పాటు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా విద్యార్థులతో యోగా ఆసనాలు చేయించి, యోగా యొక్క విశిష్టత, ఆరోగ్య పరిరక్షణలో దాని ప్రాముఖ్యత, నిత్య జీవితంలో యోగా అవసరాన్ని వివరించారు. శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగా ఎంతగానో దోహదపడుతుందని, ప్రతి ఒక్కరూ యోగాను దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని వారు సూచించారు. కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగగా విద్యార్థులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని యోగా దినోత్సవాన్ని విజయవంతం చేశారు.

